## బాలుర వసతి గృహంలో యువతికి చోటు

- ఆలస్యంగా వెలుగులోకి..
- గోప్యంగా ఉంచాలని వార్డెన్ గంగాకిషన్ విద్యార్థులకు హుకూం

డిచ్‌పల్లి, జూలై 8 : టీయూలోని న్యూ బాయ్స్ హాస్టల్ గదిలో ఉంటున్న ఓ విద్యార్థి తనకు పరిచయం ఉన్న ఓ యువతికి వసతి కల్పించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇది కాస్తా సోషల్‌మీడియాలో వైరల్ కావడం కలకలం రేపుతున్నది. యూనివర్సిటీలోని బాటనీ రెండో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి న్యూబాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. తనకు పరిచయం ఉన్న ఓ స్నేహితురాలు నిజామాబాద్‌కు రావడంతో ఆమెను తాను ఉంటున్న బాయ్స్ హాస్టల్‌కు జూన్ 25న రాత్రికి 8.30 గంటల సమయంలో తీసుకువచ్చి ఉంచినట్లు సమాచారం. తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో యువతిని బయటికి పంపుతున్న సమయంలో సహచర విద్యార్థులు గమనించి, హాస్టల్, చీఫ్ వార్డెన్లకు సమాచారం అందజేశారు. ఈ ఘటనపై రిజిస్ట్రార్ యాదగిరి విచారణ జరిపించడంతో 15 రోజుల క్రితం ఓ యువతిని గదికి తీసుకువచ్చి వసతి కల్పించినట్లు విచారణలో తేలింది. సదరు విద్యార్థిని యూనివర్సిటీ, హాస్టల్ నుంచి సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ వెల్లడించారు. సెక్యూరిటీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం బయటికి పొక్కకుండా గోప్యంగా ఉంచాలని వార్డెన్ గంగాకిషన్ విద్యార్థులను బెదిరించినట్లు తెలిసింది.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఖలీల్‌వాడి, జూలై 8 : వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. కలెక్టరేట్‌లో కీటక జనిత వ్యాధుల నియంత్రణ కోసం జిల్లా స్థాయి కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో పరిసరాల శుభ్రత, నీటి నిల్వల తొలగింపు, పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు, తాగునీటి ప్రాంతాల వద్ద క్లోరినేషన్ చేయాలని సూచించారు. వివిధ శాఖలతో కో–ఆర్డినేషన్ కలిగి ఉండి, జిల్లాలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలకుండా గ్రామస్థాయిలో ప్రజలకు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. చిన్నారులకు డయేరియా సోకకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, డీఈవో దుర్గాప్రసాద్‌తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటా ఇన్నోవేటర్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కంఠేశ్వర్, జూలై 8 : ఇంటింటా ఇన్నోవేటర్ – 2024 కార్యక్రమ వాల్ పోస్టర్లను నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం ఆవిష్కరించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ఆవిష్కర్తలు నేటి నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాకు ఒక్కరు చొప్పున 33 మంది యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తున్నారని చెప్పారు. దరఖాస్తులను నేరుగా వాట్సాప్ 9100678543 నంబర్‌కు పంపవచ్చని, మరిన్ని వివరాల కోసం 9441191829 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# ఆ పదవులు పదిలమే..

- కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం
- పాత తేదీతో ఉత్తర్వులు విడుదల
- ఊపిరి పీల్చుకున్న కాంగ్రెస్ నేతలు
- ఉమ్మడి జిల్లాలో నలుగురికే పదవులు
- ఆశావహుల్లో అలుముకున్న నిరాశ
- రాష్ట్ర, జిల్లాస్థాయి పదవులకు పైరవీలు









నిజామాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎట్టకేలకు ఆ నలుగురికి పదవులు వరించాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన లీకుల ఆధారంగానే జీవోలు సైతం విడుదల అయ్యాయి. ఎన్నికల కోడ్‌కు గంటల వ్యవధిలోనే రాష్ట్ర వ్యాప్తంగా 37మందికి వివిధ కార్పొరేషన్ పదవులను కట్టబెడుతున్నట్లుగా పీసీసీ లీకులు ఇచ్చింది. కానీ అధికారికంగా ఎక్కడా సమాచారం బయటికి పొక్కలేదు. ఎన్నికల కోడ్ ఉండడంతో లీకు సమాచారంలో పేరున్న వారంతా బయటికి సంబురం చేసుకోలేక, అధికారికంగా జీవో లేక ఇబ్బందిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలంటూ పీసీసీ మెలిక పెట్టడంతో వారిలో తీవ్ర భయాందోళనలు మొదలయ్యాయి. ఎంపీ అభ్యర్థులు గెలిస్తే సరే, ఓడితే పదవి ఉంటుందా? ఉండదా? అవకాశం ఇస్తారా? లేదా అనే మీమాంసలో కొట్టుమిట్టాడారు. ఎన్నికల కోడ్ జూన్ 6తో ముగిసినప్పటికీ జీవో జారీ కాకపోవడంతో పదవుల భర్తీలో ప్రతిష్టంభన నెలకొన్నట్లయ్యింది. ఇంటా బయటా పీసీసీ నాయకత్వంపై తీవ్రమైన ఒత్తిడి పెరగడంతో మొదట బయటికి వచ్చిన జాబితాలోని వ్యక్తులకే పదవులను కట్టబెట్టారు. నాలుగు నెలల ఎదురుచూపులు ఫలించడంతో పదవులు వరించిన వారంతా సంబురం చేసుకుంటున్నారు.

### ఆశావహుల హైరానా...

ఉమ్మడి జిల్లాలో దశాబ్ద కాలంపాటు పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న వారు ఎంతో మంది పదవుల కోసం పోటీ పడుతున్నారు. అందులో కేవలం నలుగురికి మాత్రమే పదవులను కట్టబెట్టడం, మిగిలిన వారిని విస్మరించడంపై ఆశావహుల్లో నిరాశ అలుముకున్నది. 'మేరా నెంబర్ కబ్' ఆయేగా అనుకుంటూ చాలా మంది హస్తం పార్టీ నేతలు ఎదురుచూపులు చేశారు. రాష్ట్రస్థాయిలోనూ మరిన్ని పదవుల భర్తీకి ప్రభుత్వానికి అవకాశాలున్నాయి. అలాగే జిల్లాస్థాయిలో వివిధ శాఖలకు సంబంధించిన నామినేటెడ్ పదవుల భర్తీకి ప్రభుత్వం పూనుకుంటే చాలా మందికి అవకాశం దక్కే వీలున్నది. జిల్లా స్థాయిలో పదవులనైనా తమకు అప్పగిస్తే అదే పది వేలు అంటూ చాలా మంది పీసీసీ నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న మానాల మోహన్ రెడ్డికి కార్పొరేషన్ పదవి కట్టబెట్టడంతో డీసీసీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకులకు చోటు దక్కుతుందని తెలుస్తున్నది. స్థానిక సంస్థలకు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆశావహులు భారీగా పోటీ పడుతున్నారు. స్థానిక పోరులో గెలిచి కీలకమైన పదవులను చేజిక్కించుకోవడం, లేదంటే పార్టీ పదవుల్లో చోటు సంపాదించుకునేందుకు ఆరాటపడుతున్నారు.

### పాత తేదీతో జీవోలు..

ఉమ్మడి జిల్లాలో మొత్తం నలుగురు కాంగ్రెస్ నాయకులను పదవులు వరించాయి. ఇందులో నిజామాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు, కామారెడ్డి జిల్లాకు చెందిన ఒకరున్నారు. ఆగ్రోస్ చైర్మన్‌గా కాసుల బాలరాజు, తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా అన్వేశ్ రెడ్డి, తెలంగాణ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్ రెడ్డి, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్ నియామకం అయ్యారు. వీరందరికీ ఒకే రోజు ఒకే తేదీ పేరిట ఉత్తర్వులు విడుదలయ్యాయి. మార్చి 15, 2024న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేరిట జారీ చేసిన వివిధ జీవోలు అకస్మాత్తుగా జూలై 8, 2024న ప్రత్యక్షం కావడం వెనుక ఉన్న మర్మం ఏమిటో అర్థం కావడం లేదు. ఒకవేళ జీవోలు మూడు నెలల క్రితమే జారీ చేస్తే.. ఆనాటి నుంచి గోప్యంగా ఉంచడం వెనుకున్న ఆంతర్యం ఏమిటో కాంగ్రెస్ నాయకులకు కూడా అంతుచిక్కడం లేదు. పదవుల ఆశ చూపించి సొంత పార్టీ నేతలను పార్లమెంట్ ఎన్నికల్లో మరింత ఎక్కువగా పనిచేసేలా భయపెట్టినట్లుగా పలువురు చర్చించుకుంటున్నారు. ఎన్నికల వేళ ఉత్తర్వులు విడుదల చేస్తే మిగిలిన వారి నుంచి ఒత్తిడి పెరిగి పార్టీలో అసంతృప్తి రాజుకొని ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే కారణం కూడా అయి ఉండొచ్చన్న వాదన వినిపిస్తున్నది.

## 'ప్రజావాణి'కి 105 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు

కంఠేశ్వర్, జూలై 8 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 105 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు వినతిపత్రాలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీపీవో తరుణ్‌కుమార్‌కు విన్నవిస్తూ అర్జీలను సమర్పించారు.

**వీఆర్ఏల కారుణ్య నియామకాలు చేపట్టాలని వినతి**

కారుణ్య నియామాకాలు చేపట్టాలని జిల్లా వీఆర్ఏ జేఏసీ సభ్యులు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులర్ చేయడంతోపాటు కారుణ్య నియామకాలకు అనుమతి ఇస్తూ జీవో నంబర్ 81ను జారీచేసిందని పేర్కొన్నారు. జీవో ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులను కానీ నియమించాలని, ప్రభుత్వం నియామకాలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి 3,797 మంది వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు.

**మానవతాదృక్పథం చాటిన డీపీవో**


వృద్ధుడి సమస్యను వింటున్న డీపీవో చక్రవర్తి తరుణ్‌కుమార్

కంఠేశ్వర్,జూలై 8 : ప్రజావాణి కార్యక్రమంలో డీపీవో చక్రవర్తి తరుణ్‌కుమార్ మానవతా దృక్పథాన్ని కనబర్చారు. తన సమస్య చెప్పుకోవడానికి వినతిపత్రంతో అధికారుల వద్దకు వచ్చిన 75 ఏండ్ల వృద్ధుడు నడవలేని స్థితిలో ఇబ్బందులు పడుతుండడంతో గమనించిన డీపీవో.. వృద్ధుడి దగ్గరికి వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## తండ్రి హత్యకేసులో కుమారుడికి జీవితఖైదు

కామారెడ్డి, జూలై 8: కన్న తండ్రిని హత్యచేసిన కేసులో కుమారుడికి కోర్టు జీవితఖైదుతోపాటు రూ.10వేల జరిమానా విధించినట్లు కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. బీబీపేట గ్రామానికి చెందిన బోయిన రాజయ్యకు తన తండ్రి బోయిని నర్సయ్య(60) మధ్య ఆస్తి పంపకాల విషయంలో తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో 2019 జూలై 15వ తేదీన పొలానికి వెళ్లిన తన తండ్రిపై రాజయ్య కర్రలతో దాడిచేసి హతమార్చాడు. దీనిపై మృతుడి కోడలు బోయిని లక్ష్మి బీబీపేట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు బోయిన అంజయ్యను అరెస్టు చేశారు. కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేశారు. కేసులో సాక్షులను విచారించి,సాక్ష్యాధారాలను పరిశీలించి కేసు రుజువు కావడంతో జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్ ముద్దాయికి జీవిత ఖైదు తో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

## నాన్‌టీచింగ్ ఉద్యోగుల జీవో నంబర్ 80 నిషేధం ఎత్తివేత

ఖలీల్‌వాడి, జూలై 8 : నాన్‌టీచింగ్ ఉద్యోగుల జీవో నంబర్ 80ని ఎత్తివేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్, సబార్డినేట్, సీనియారిటీ జాబితా, క్యాడర్ వైస్ ఖాళీల జాబితా, మాడల్ ఆప్షన్ ఫామ్‌ను డీఈవో కార్యాలయంలో ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ జాబితాలో అభ్యంతరాలు ఉంటే విద్యాశాఖ కార్యాలయంలో ఈ నెల 9న సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని పేర్కొన్నారు. ఆప్షన్ ఫామ్ సంబంధిత హెచ్‌ఎం ద్వారా ధ్రువీకరించి ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జిల్లా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి/ ఇందల్వాయి, జూలై 8 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 102 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జడ్పీహెచ్ఎస్‌లో కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించారు. వనహోత్సవంలో భాగంగా పాఠశాలల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో సతీశ్, ఎంఈవో శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు అనంతరెడ్డి, అప్పల రాజన్న, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ సర్పంచులు చిన్న సాయారెడ్డి, నర్సారెడ్డి, బాలకిషన్, ఎంపీటీసీ గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ గంగారెడ్డి పాల్గొన్నారు. వీఆర్ఏల వారసత్వ నియామకాలు చేపట్టాలని వీఆర్ఏ మండల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఇందల్వాయిలోని కింది కాలువ, పెద్ద కాలువ మరమ్మతులు చేయించాలని, రామాలయంలో సమస్యను పరిష్కరించాలని కోరుతూ వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మొత్కురి నవీన్‌గౌడ్, వీడీసీ అధ్యక్షుడు జితేందర్, బాల్‌రెడ్డి, లింగం, శ్రీనివాస్, జనార్దన్ పాల్గొన్నారు.

## ఇదేం అభిమానం 'స్వామి'

**ఒకే టీచర్ కోసం రెండు గ్రామాల పట్టు**

రాజంపేట్, జూలై 8: ఉపాధ్యాయుల బదిలీ ఏమో కానీ కొన్ని ఉదంతాలు బాగా చర్చనీయాంశమవుతున్నాయి. ట్రాన్స్‌ఫర్‌పై వెళ్తున్న టీచర్లను పట్టుకుని విద్యార్థులు విలపించిన ఘటనలు రోజూ కనిపిస్తూనే ఉన్నాయి. మరో ఘటనలో ఓ ఉపాధ్యాయుడి కోసం రెండు గ్రామాలు పట్టుబట్టడం, నిరసనలకు దిగడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అసలేం జరిగిందంటే.. రాజంపేట మండలం శివాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు స్వామి ఇటీవల పొందుర్తికి బదిలీఅయ్యారు. ఆయన బదిలీని రద్దుచేసి, తమ గ్రామంలోనే కొనసాగించాలని మూడు, నాలుగు రోజులుగా శివాయిపల్లి గ్రామస్తులు నిరసనలు చేపట్టారు. డీఈవోను కలిసి వినతిపత్రం కూడా సమర్పించారు. మరో వైపు, బదిలీల్లో భాగంగా తమ గ్రామానికి కేటాయించిన సదరు టీచర్‌ను అలాగే కొనసాగించాలని తాజాగా పొందుర్తి వాసులు ఆందోళనకు దిగారు. సోమవారం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో సమావేశమైన ఆదర్శ పాఠశాల సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. టీచర్ స్వామి బదిలీని రద్దు చేయకుండా పొందుర్తి స్కూల్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇందుకు అధికారులు సహకరించాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు ఈ సందర్భంగా తీర్మానించారు.


నినాదాలు చేస్తున్న పొందుర్తి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు

---

**వాణిజ్య**

# భెల్, ఓడీఎఫ్‌లకు గ్రహణం

- కేంద్రం నుంచి ఆర్డర్లు కరువు
- ఇలాగే కొనసాగితే ఖాయిలానే అంటున్న కార్మిక సంఘాలు
- కేసీఆర్ చేయూతతో ఊరట
- కంపెనీల్లో కొత్త రిక్రూట్‌మెంట్ బంద్‌పెట్టిన బీజేపీ ప్రభుత్వం

### ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని కార్పొరేషన్‌గా మార్చిన మోదీ సర్కారు

ఆత్మనిర్భర్ భారత్ అంటూ గొప్పలకు పోయే మోదీ సర్కారు.. కీలక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది.

*సంగారెడ్డి జిల్లాలో మూడు ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలున్నాయి. రక్షణ రంగానికి సంబంధించి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, బీడీఎల్ పరిశ్రమలుండగా.. వీటితోపాటు బీహెచ్ఈఎల్ ఉన్నదీ ఇక్కడే.*

ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు వీటిని స్థాపించారు. అయితే నరేంద్ర మోదీ ఆ పదవిలోకి వచ్చాక ఇవి నిర్వీర్యమైపోతున్నాయి. నష్టాలబాటపట్టి ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అయినప్పటికీ గత పదేండ్లలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రభుత్వం తరపున ఆర్డర్లిస్తూ ఆదుకున్నారు.




ఓడీఎఫ్‌లో తయారైన యుద్ధ ట్యాంకును సంగారెడ్డి జిల్లా కంది మండలం మల్కాపూర్ చెరువులో పరీక్షిస్తున్న ఇంజినీర్లు (ఫైల్) (ఇన్‌సెట్)సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్ఈఎల్

సంగారెడ్డి, జూలై 8 (నమస్తే తెలంగాణ): నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు గ్రహణం పట్టుకున్నది. ప్రైవేటీకరణ పేరుతో సర్కారీ కంపెనీలు కుదేలయ్యాయి. తెలంగాణ విషయానికే వస్తే.. సంగారెడ్డి జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) పరిశ్రమలు అధోగతి పాలయ్యాయి. కేంద్ర ప్రభుత్వ చిన్నచూపుతో కొత్త ఆర్డర్లు లేక నష్టాల్లోకి జారుకున్నాయి. ఉద్యోగాలు లభించక యువత ఇబ్బందులు పడుతున్నది.

**కార్పొరేషన్ పరిధిలోకి ఓడీఎఫ్**

సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామ పరిధిలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉన్నది. గతంలో భారత ప్రభుత్వ రంగ సంస్థగా ఉండేది ఇది. క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, మైన్ ప్రూఫ్–బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు తయారయ్యేవి. మిలటరీ అవసరాలకు కేంద్రం ఓడీఎఫ్‌కు వరుసగా ఆర్డర్లు ఇచ్చేది. అయితే మోదీ సర్కారు దీన్ని కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)లోకి చేర్చారు. దీంతో ఆర్డర్లు తగ్గిపోయాయి. గతంలో ఓవర్ డ్యూటీలు చేసే కార్మికులు.. ఇప్పుడు పనిలేక ఉన్న కొలువులు ఎక్కడ ఊడిపోతాయోనన్న భయంతో బతికేయాల్సి వస్తున్నది. ఆర్డర్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరితే ఓపెన్ టెండర్లలో పాల్గొని తెచ్చుకోవాలంటూ సూచిస్తోంది. దీని వెనుక కంపెనీని ప్రైవేట్‌పరం చేయాలన్న కుట్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. 3 వేల మంది కార్మికులు, వారి కుటుంబాల భవిష్యత్తు అంధకారంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లాలోని భానూరులో బీడీఎల్ పరిశ్రమ ఉన్నది. దీనికీ కేంద్ర ప్రభుత్వం మొండిచెయ్యే చూపిస్తున్నది. ప్రైవేటీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ ఇటీవలే కార్మికులు ఆందోళన సైతం చేశారు.

**భెల్‌కు ఆర్డర్లివ్వని కేంద్రం**

సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురంలో బీహెచ్ఈఎల్ ఉన్నది. దీన్ని ప్రైవేట్‌పరం చేసే కుట్రను మోదీ ప్రభుత్వం పన్నుతోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 5 వేల మంది కార్మికులు భెల్‌లో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో గ్యాస్ టర్బైన్లు, ఆయిల్ రిగ్గులు, కంప్రెషర్లు, బాయిలర్లు, హీటర్లు, భారీ పంపులు తయారవుతాయి. మోదీ గద్దెనెక్కిన తర్వాత ప్రభుత్వ ఆర్డర్లు కరువయ్యాయి. వేలాది కోట్ల రూపాయల లాభాలను ఆర్జించిన బీహెచ్ఈఎల్.. నష్టాల బాటపట్టింది.

### కేసీఆర్ చొరవతో..

*మూడేండ్ల క్రితం అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేయూతనివ్వడంతో ప్రస్తుతం భెల్ లాభాలను ఆర్జిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన పంపుల ఆర్డర్లను బీహెచ్ఈఎల్‌కే ఇచ్చారు. అలాగే తెలంగాణలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్తు ప్రాజెక్టులకు సంబంధించి మిషనరీ ఆర్డర్ కూడా దక్కింది. బీహెచ్ఈఎల్ మనుగడకు నాటి సీఎం కేసీఆర్ నిర్ణయాలే కారణమని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయిప్పుడు. మొత్తానికి ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ అంటూ ప్రైవేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తున్నారని కార్మిక నాయకులు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ రంగ సంస్థలు మూతబడేలా చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.*




## బెంజ్ ఎంట్రీలెవల్ ఈవీ కారు

**ప్రారంభ ధర రూ.66 లక్షలు**

న్యూఢిల్లీ, జూలై 8: లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్–బెంజ్..తొలిసారి లగ్జరీ కార్లను కొనుగోలు చేసేవారి లక్ష్యంగా ఎలక్ట్రిక్ ఎంట్రీలెవల్ కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.66 లక్షలు. వీటితో పాటు ఐదు సీట్ల ఈక్యూబీ 350 ఎస్‌యూవీ మాడల్ ధర రూ.77.5 లక్షలు, ఈక్యూబీ 250+(ఏడుగురు) రూ.70.90 లక్షల ధర కలిగిన మాడళ్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది చివర్లో ఈక్యూఎస్ మేబ్యాక్ ఎస్‌యూవీ, జీ–క్లాస్ మాడళ్లను సైతం ఈ ఏడాది చివర్లో ఈవీ విభాగంలో విడుదల చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. వీటి ధర రూ.3 కోట్లు ఉండనున్నట్లు చెప్పారు.

## హెచ్‌డీఎఫ్‌సీ రుణాలు ప్రియం

**వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు పెంచిన బ్యాంక్**




హైదరాబాద్, జూలై 8: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి వడ్డీరేట్లను పెంచింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో రుణ గ్రహీతలపై అదనపు భారం పడనున్నది. దీంతో ఎంసీఎల్ఆర్ రేటు 9.05 శాతం నుంచి 9.40 శాతం మధ్యలోకి చేరింది. పెరిగిన రేట్లు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు కాలపరిమితి రుణాలపై వడ్డీరేటుని 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో వడ్డీరేటు 8.95 శాతం నుంచి 9.05 శాతానికి చేరుకున్నది. అలాగే నెల కాల పరిమితితో రుణాలపై వడ్డీ 9 శాతం నుంచి 9.10 శాతానికి పెరగగా..మూడు నెలల రుణాలపై వడ్డీరేటు 5 బేసిస్ పాయింట్లు సవరించడంతో రేటు 9.15 శాతం నుంచి 9.20 శాతానికి చేరుకున్నది. ఆరు నెలల రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.35 శాతానికి చేరుకోగా, ఏడాది రుణాలపై రేటు 9.30 శాతం నుంచి 9.40 శాతానికి సవరించింది. రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటుని 9.40 శాతానికి సవరించింది బ్యాంక్. వీటితో పాటు బ్యాంక్ బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటుని 17.90 శాతానికి, బేస్‌రేటుని 9.40 శాతానికి పెంచింది.

## ఆర్బీఐ సమీక్షకు టమాట సెగ

ముంబై, జూలై 8: మార్కెట్‌లో మళ్లీ పెరుగుతున్న టమాట ధరల సెగ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు తగులుతున్నది. తగ్గినట్టే తగ్గి తిరిగి పుంజుకున్న టమాట రేట్లు.. కిలో రూ.100కు చేరువయ్యాయి మరి. దీంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్న సెంట్రల్ బ్యాంక్.. ఇంకొన్నాళ్లు అలాగే ఉంచవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబైల్లో కిలో టమాట రూ.90 పలుకుతున్నది. కాగా, దేశీయంగా టమాట సాగులో కర్నాటక, ఏపీల వాటానే 35 శాతంగా ఉన్నది. తగ్గని ఉష్ణోగ్రతలు, కురువని వర్షాలు.. పంటకు ఆటంకంగా మారాయి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి కీలక వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉంటున్నాయి. ద్రవ్యోల్బణం దెబ్బకు వచ్చే నెల ద్రవ్యసమీక్షలోనూ అంతే ఉండొచ్చంటున్నారు.

## పీఎస్బీల్లో వాటాల్ని అమ్మేయండి

**ఇదే సరైన సమయం: ఎస్బీఐ నివేదిక • సర్కారీ బ్యాంకులు ఇంకా తగ్గాలి**

న్యూఢిల్లీ, జూలై 8: ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్బీ)ల్లో వాటాల విక్రయానికి ఇదే సరైన సమయమని సర్కారీ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ సోమవారం తమ రిసెర్చ్ రిపోర్ట్‌లో పేర్కొన్నది. 'బ్యాంకులు ప్రస్తుతం పరిపుష్ఠంగా ఉన్నాయి. ప్రభుత్వ బ్యాంకుల్లో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వానికి ఇదే సరైన సమయం. త్వరగా దీనిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి' అని 'కేంద్ర బడ్జెట్ 2024–25కి నాంది' పేరిట విడుదల చేసిన ఈ నివేదికలో ఎస్బీఐ అభిప్రాయపడింది. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణపై స్పందిస్తూ '2022 అక్టోబర్‌లో కొనుగోలుదారుల నుంచి బిడ్లను ఆహ్వానించారు. 2023 జనవరిలో ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ (దీపం)కు కొందరు తమ ఆసక్తిని వ్యక్తపర్చారు. రాబోయే బడ్జెట్‌లో దీనిపై ఓ స్పష్టత రావచ్చు' అని ఎస్బీఐ తెలిపింది. ప్రస్తుతం ఐడీబీఐలో కేంద్రం వాటా 45.48 శాతంగా ఉంటే, ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ వాటా 49.24 శాతంగా ఉన్నది. మిగతా వాటా మైనారిటీ షేర్‌హోల్డర్ల వద్ద ఉన్నది. అయితే దాదాపు 61 శాతం వాటాను అమ్మేయాలని కేంద్రం, ఎల్ఐసీ చూస్తున్నాయి.

**బ్యాంకుల సంఖ్య తగ్గాలి**

ప్రస్తుతమున్న ప్రభుత్వ బ్యాంకులు మరింతగా ఏకీకృతం కావాలన్న అభిప్రాయాన్ని ఎస్బీఐ వెలిబుచ్చింది. తద్వారా ఇంకా సర్కారీ బ్యాంకుల సంఖ్య తగ్గాల్సిన అవసరం ఉందని చెప్పింది. ఇప్పటికే గతంతో పోల్చితే ప్రభుత్వ బ్యాంకుల సంఖ్య చాలా తగ్గిపోయింది. ఆయా బ్యాంకుల్లో ఒకటి, రెండు, అంతకుమించి బ్యాంకులు విలీనమైపోయాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 12 సర్కారీ బ్యాంకులే మిగిలాయి. అయినప్పటికీ ఇంకా తగ్గాలని ఎస్బీఐ చెప్తుండటం ఇప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. డిపాజిట్లపై పొందే వడ్డీ ఆదాయంపై పన్నును సవరించాలని ఎస్బీఐ కేంద్రానికి సిఫార్సు చేసింది. మ్యూచువల్ ఫండ్, ఈక్విటీ మార్కెట్లకు అనుగుణంగా సర్దుబాటు చేయాలని కోరింది. '2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రజల నికర ఆర్థిక పొదుపు జీడీపీలో 5.3 శాతానికి తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం 2023–24లో ఇది 5.4 శాతానికే పెరుగవచ్చనిపిస్తున్నది. అయితే మ్యూచువల్ ఫండ్ల రాబడులతో సమానంగా డిపాజిట్ల వడ్డీరేటుంటే సేవింగ్స్ బాగా పెరిగేందుకు వీలున్నది.' అని ఎస్బీఐ ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఈ సందర్భంగా సూచించింది. ఈ నెల 23న ఈ ఆర్థిక సంవత్సరానికి (2024–25)గాను పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు.

## స్టార్ ఫిన్‌సర్వ్‌కు ఆర్బీఐ షాక్

న్యూఢిల్లీ, జూలై 8: మరో రెండు బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థలకు రిజర్వుబ్యాంక్ షాకిచ్చింది. అక్రమ రుణ పద్ధతుల కారణంగా స్టార్ ఫిన్‌సర్వ్ ఇండియాతోపాటు మరో సంస్థ పాలీటెక్స్ ఇండియా లైసెన్సులను రద్దు చేసింది. హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఫిన్‌సర్వ్ ఇండియా ప్రాగ్‌క్యాప్, అలాగే ముంబై కేంద్రస్థానంగా పాలీటెక్స్ ఇండియా కార్యకలాపాలు అందిస్తున్నాయి. అవుట్‌సోర్సింగ్ ద్వారా డిజిటల్‌గా రుణాలు మంజూరు, వసూళ్లు నిర్వహించినందుకుగాను స్టార్ ఫిన్‌సర్వ్‌కి చెందిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. కేవైసీ ధృవీకరణ ప్రక్రియ కూడా అవుట్‌సోర్సింగ్ ఇవ్వడం ఆర్బీఐ అభ్యంతరాలు వ్యక్తంచేసింది.

## హైదరాబాద్‌లో సీ1 విస్తరణ

**మరో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆఫీస్**



హైదరాబాద్, జూలై 8: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ సీ1..హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీ సెంటర్(జీఐసీసీ)ని మరింత విస్తరించింది. గతేడాది 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కార్యాలయానికి అదనంగా మరో 20 వేల చదరపు అడుగుల కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించింది. సత్వ నాలెడ్జ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 600 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచుకునే అవకాశం ఉన్నదని కంపెనీ ఎండీ, కంట్రీ హెడ్ చంద్ర బొడ్డొజు తెలిపారు. అంతర్జాతీయంగా ఫార్చ్యూన్ 500 సంస్థల్లో సగం తమ క్లయింట్లను, వీటికి ఇక్కడి నుంచే సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పరిశోధన–అభివృద్ధి(ఆర్అండ్‌డీ)ని కూడా ఏర్పాటు చేసినట్లు, దీంట్లో ప్రస్తుతం 60 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది చివరినాటికి మొత్తం సిబ్బంది సంఖ్యను వెయ్యికి పెంచుకునే అవకాశాలున్నాయన్నారు.